# శ్రీశ్రీ సిద్ధేశ్వరీ లిమిటెడ్

కథకులు

పరశురాం

అనువాదకులు

చక్రపాణి



స్వస్తిశ్రీ విభవనామ సంవత్సర మాఘశుద్ధ విదియ లక్ష్మివారం లూథరన్ చర్చి గడియారము అప్పుడే పదకొండుగంటలు కొట్టింది. శ్యామబాబు తోలుసంచి చేతపట్టుకొని జూడాస్ లేన్‌లో వుండే మూడంతస్తుల మేడవద్దకు వచ్చాడు. మేడ చాల పురాతనమైనది. క్రమంగా సున్నం కొడుతూ, రంగువేస్తూ వుంటంవల్ల 'హెయిర్ డై'కి అలవాటుపడ్డ ముసలివాని మాదిరిగ అయిపోయింది దానిపని. క్రిందస్తులో సామాన్లు నిల్వ చేస్తూ వుంటారు (గోడౌన్సు) చీకటి అవుసరంకంటె అధికంగా వుంది. రెండో అంతస్తులో ముందువైపు కమీషన్ కొట్లు, వెనుకవైపున నానాజాతులవారు కాపురముంటున్నారు. ప్రవేశద్వారము దగ్గిరగనే పైకి పోవటానికి కొయ్యమెట్లున్నవి-'ఉమ్మి వేయకూడదు'- అనే నోటీసు అంటించబడి వున్నప్పటికి, మెట్లకటు యిటు గోడలు తాంబూలపు ఉమ్మిచే ఎర్రబడిపోయింది. బొద్దింకలు చిట్టెలుకలు, పరస్పర అహింసాభావముతో అటు యిటు తిరుగుతూవున్నవి. మెట్లు ఎక్కే దిగే వారంటే వాటకి లేశముకూడ భయములేదు-ఆశ్రమ మృగాలమాదిరి నిశ్శంకగా వున్నని. మురుగు కాల్వల మురికి వాసన, వెనుకవుండే అరవ పరివారపు వంట యింట్లోనుంచి వచ్చే యింగువకంపుతో కలిసి, యీ చోటంతా ఆక్రమించింది. కమీషను వ్యాపారస్తులకు యీ తుచ్ఛవిషయమంటే లెఖ లేదు. వాళ్లుయిచ్చి పుచ్చుకోటాలు, గిరాకీమందాలు, జమాఖర్చులు మొదలగు మహత్కార్యాలలో నిమగ్నులై వున్నారు.

శ్యామబాబు మూడో అంతస్తులోవుండే ఒక గదివద్దకువెళ్లి తాళం తెరచాడు. గదిబయట, వాకి

లికి దగ్గరగానే సైన్ బోర్డుమీద వ్రాసివుంది: 'బ్రహ్మచారీ అండ్ బ్రదర్-యిన్-లా, జనరల్ మర్చెంట్సు'. యీ వ్యాపారానికి యజమానులు శ్యామబాబు (శ్యామలాల్ గంగూలీ), అతని బావమరిది, విపిన్ చంద్ర చౌధరి బి. యస్‌సి. గదిలోపల చాల పురాతన కుర్చీలు, మేజాలు, బీరువాలు వగైరా ఆఫీసుకు పనికివచ్చే సామాన్లు పడి వున్నై. ఒక టేబిలుమీద చాల ఖాతా పుస్తకాలు, రిజస్టర్లు, పంచిపెట్టటానికి వేయించిన నోటీసులు, ఒక ఓల్డు థేకర్సు డైరక్టరీ చాలా యితర కంపెనీల నియమావళులు articles, యింకా యితర కాగితాలు పడివున్నై. గోడకు అనుకొనివున్న గడంచు (Stand) మీద చాల మందుల సీసాలు, ఖాళీ రాగితాయిత్తులు వున్నై. ఒకప్పుడు శ్యామబాబు 'స్వప్నదోషం' మొదలగు వ్యాధులకు పేటెంటు ఔషధాలు అమ్ముతూవుండేవాడు. వాటికి యివి స్మృతి.

శ్యామబాబు దాదాపు ఏభై ఏండ్లవాడు. ముఖం కారునలుపు, గడ్డం అక్కడక్కడ నెరసింది; తల వెంట్రుకలు మెడవరకు వ్రేలాడుతూ పైకి తిరిగి వున్నాయి. స్థూలదేహం, శరీరంనిండా రోమాలు. చిన్నప్పటినుంచి స్వతంత్రంగా వ్యాపారము చేయాలనే కోరికగలవాడు; కాని అనేక కారణాలవల్ల వ్యాపారంలో అంతగా గిట్టుబాటు కాలేదు. ఇ. ఐ. రైల్వే అవుట్ ఆఫీసులో గుమస్తాపనే అతని జీవనోపాధికి ప్రధాన సాధనం. స్వగ్రామంలో కొద్దిగా మాన్యము ఒకపాడుపడ్డ కాళికాలయం కూడ వుంది; కాని వాటి ఆదాయం చాలకొద్ది. శలవు దొరకినప్పుడెల్లా వ్యాపారం చేయటానికి ప్రయత్నిస్తూ వుంటాడు. యీ విషయంలో యితని బావమరిది విపినుడు యితని ముఖ్య సహాయకుడు. సంతానంలేదు. కలకత్తాలో అద్దె యిల్లు తీసుకుని భార్య, బావమరదులతో వుంటున్నాడు. వ్యాపారంలో కొంచెం గిట్టుబాటుకాగానే నౌకరి వదిలేయాలని యితనికోర్కె. ప్రస్తుతం ఆరుమాసాలు శలవు తీసుకొని క్రొత్తగా 'బ్రహ్మచారీ అండ్ బ్రదర్-యిన్-లా' అనే కంపెనీ పెట్టాడు.

శ్యామబాబు ధర్మభీరువు. పంచాగం చూడంది ఏపనీ చేయడు-ఆవశ్యకతానుసారం తాంత్రిక సాధన కూడ చేస్తూవుంటాడు. వృథా-అంటే ఆకలిలేకుండా-మాంసభోజనం, అకారణంగా అంటే భోంచేయకుండా తాంబూలం వేయడు. ఏ సన్యాసి బంగారం చేయగలడో, ఎవరిదగ్గర వామావర్తశంఖంగాని, ఏకముఖ రుద్రాక్షగాని వుందో, ఏ గోసాయి తామ్రభస్మం చేయగలడో-ఎల్లప్పుడు వీళ్ల జాడలు తీస్తూవుంటాడు. కొద్ది మాసాలనుంచి యింట్లో కాషాయ వస్త్రాలుకూడ ధరిస్తూ వస్తున్నాడు. తనకు అనుకూలురైన శిష్యులను కూడ కొద్దిమందిని సంపాయించుకున్నాడు. శ్యామబాబు తనను తను అప్పుడప్పుడు 'శ్రీమత్ శ్యామానంద బ్రహ్మచారీ' అని చెప్పుకుంటాడు. త్వరలో యీపేరంతటా ప్రచారమవుతుందని కూడ అతని నమ్మకం.

శ్యామబాబు ఆఫీసురూమ్‌లో ప్రవేశించాక, కొంచెంసేపాక మూడున్నరకాళ్ల కుర్చీమీద విశ్రాంతి తీసుకున్నాడు. తర్వాత నౌకరును కేకవేశాడు—'రాముడూ, ఒరేయి, రాముడూ!' రాముడు ప్రక్కగదిదగ్గర స్టూలుమీద కూర్చొని కునికిపాట్లు పడుతున్నాడు. యజమాని కేకవిని త్రుళ్లిపడిలేచి అక్కడినుండే-'వస్తున్నానండీ' అని అరచాడు. శ్యామ బాబు అన్నాడు—'హో, గంగాజలం తీసుకురా మరి యీ పుస్తకాలుకూడ దులుపు, చాల దుమ్ము పడివున్నై.' రాముడొక రాగిచెంబు తెచ్చి శ్యామబాబుకిచ్చాడు. శ్యామబాబు కొద్దిగా జలంతీసుకొని మంత్రాలు ఉచ్చరించుతూ గదంతటా చల్లాడు. తర్వాత చిన్నపెట్టెలోంచి-కుంకుమబొట్టు పెట్టబడివున్న రబ్బరు స్టాంపుతీసి దాని సహాయంతో 108సార్లు 'శ్రీశ్రీదుర్గా' అని వ్రాశాడు. స్టాంపులో 12వరుసలు 'శ్రీశ్రీదుర్గా'అని చెక్కబడివుంది. దీన్ని తొమ్మిదిసార్లు ముద్రిస్తేనే పని తీరిపోతుంది. ఈ శ్రమహారక యంత్రాన్ని కనిపెట్టినవాడు శ్రీమాన్ విపిన్ చంద్రచౌదరి. వీరే దీనికి పేరు కూడ పెట్టారు 'ది ఆటోమేటిక్ దుర్గాగ్రాఫ్' అని. త్వరలో దీనిని 'పేటెంటు' చెయ్యాలనే ప్రయత్నంలో కూడ వున్నాడు.

యీవిధంగా నిత్యకృత్యాలు నిర్వర్తించుకొని శ్యామబాబు బ్యాగ్‌లోనుంచి తడిసిన ప్రెస్‌ప్రూఫ్ తీసి సంతోషంతో సంశోధించసాగాడు. ఒకపేజీ పూర్తి

అయ్యిందోలేదో, బూట్లు టకటక లాడించుకుంటూ అటలబాబు వచ్చి అన్నాడు-'ఏమండీ శ్యామబాబు గారు, ఏంచేస్తున్నారు? మీరు చాలాసేపయినట్లుగా వుందే వచ్చి! నాకు ఆలస్యమైంది, క్షమించండి-హైకోర్టులో ఒక మోషను వుంది. బ్రదర్-యిన్-లా ఎక్కడ?"

శ్యా:-విపిన్ కాస్త బాగ్‌బజారుకు వెళ్లాడు, తీన్‌కాడీబాబు దగ్గరకు. యివ్వాళ తప్పక తేల్చుకు వస్తాడు-వచ్చే వేళకూడ అయింది.

అటలబాబు సూట్ పేంట్ వేసిన తాజా అటర్నీ. యిప్పుడే జూనియర్ పార్టనర్‌గా తండ్రిగారిపనిలో ప్రవేశించాడు. చాల అందమైనవాడు. చూపులకు పెద్దమనిషిగాను, ప్రసన్నచిత్తుడుగాను కనుపడతాడు. విపినుడికి బాల్యమిత్రుడు. ఏళ్ళకు చిన్నయినా వ్యవహారంలో పెద్ద. అడుగసాగాడు-'సరేకాని అతన్ని ఎట్లా వల్లో వేశారు?'

శ్యామ:-అరే ఏమడుగుతా వదంతా, తీన్‌కాడీ బాబు శరత్‌కు పినమామ అవుతాడు-శరత్ విపినుడికి పినతల్లికొడుకు. శరత్‌ను తీసికొని, విపినుడు నేను, తీన్‌కాడీ బాబును చూట్టానికి పోయాము. మాటల్లో అయ్యిందనుకున్నావేం? చాలకష్టంమీదకాని సరి కాలేదు. ముసలివాడెంత పీనాసో అంతకంటె అనుమానస్తుడు. అన్నాడుగదా-'నేను రావుసాహెబును, రిటైర్డు డిప్టీమేజిస్ట్రేటును, గవర్నమెంటులో నాకు చాల గౌరవముంది. మీకంపెనీలో డైరక్టరునై నా పెన్షనుకుకూడ నీళ్ళు వదులుకునేదేం?' నేనప్పుడు చాల ఉదాహరణలు యిచ్చి చెప్పాను-చాలామంది రిటైర్డు ఆఫీసర్లు డైరక్టర్లుగా వున్నారు మీకేమి భయమని ఆఖరుకు; ప్రతిమీటింగుకు 32/-ఫీజు దొరుకుతుందంటే కొంచెం మెత్తపడ్డాడు.

అటల్:-షేర్లు ఎన్నిరూపాయలకు తీసుకుంటానన్నాడు.

శ్యామ:-అందులోకూడ చాలా తెలివిగానే వున్నాడు. అన్నాడుగదా—'మీ బ్రహ్మచారీ కంపెనీ టోపీవేసి లూటీచేయదని మాకు గ్యారంటీ ఏమిటి? మీ బావ బావమరదులు మానేజింగ్ ఏజంట్లయి కంపెనీని ఫెయిల్‌చేస్తే మాడబ్బు ఎవడిస్తాడు? నేనన్నాను గదా—రావు సాహెబుగారూ, మీవంటి చతురులు సావధానులు డైరక్టర్లయివుంటే ఎవడికి గుండె మోసం చేయటానికి! ఖర్చులు గిర్చులు మీ కళ్లెదుటే జరుగుతూ వుంటవి. ఫెయిల్ ఎందుకుకానిస్తారు? కేవలం దోషాలవంకే చూట్టం! ఎందుకు? లాభాలవంకకూడ చూడండి, ఎంత గిట్టుబాటుగా వుందో హీనంలో హీనం 50%పర్సెంటు డివిడెండు వచ్చినా రెండు సంవత్సరాల్లో మీపెట్టుబడి మీకువస్తుంది! ఆఖరుకు చాల వాదం జరిగినతర్వాత అన్నాడు—'సరే, షేర్లు తీసుకుంటాగాని ఎక్కువకాదు-డైరక్టరు కావడానికి ఎన్ని తీసుకోవాలో అన్నే-యివ్వాళ బాగా ఆలోచించుకొని తేల్చివేస్తా' నన్నాడు, అందుకనే విపినుణ్ణి పంపాను.

అటల్:-యిటువంటి సందేహస్తుణ్ణి కలుపుకొని మంచిపని చేయలేరు శ్యామబాబూ! సరే, మహారాజును ఎందుకు వదలారు?

శ్యామ:—మహారాజును వల్లో వేయాలంటే మంచి వేటకాడు కావాలి—నీ నా వల్ల కాదు. యింతే కాక యిదివరకే అయిదు భూతాలు పట్టి పీల్చి పిప్పి చేసినై—ఏమీ మిగల్చలా.

అటల్:—మార్వాడీ తయారుగా వున్నాడుగా? ఎప్పుడొస్తాడు?

శ్యామ:—వాడు ఎప్పుడు వీలు చిక్కుతుందా అని నోరు తెరుచుకు కూర్చున్నాడు. యింతవరకు వాడు రావలసిందేనే. ఆం, ప్రాస్పెక్టసు మీకు వినిపించి యివ్వాళే అచ్చుకు యివ్వాలి. తిన్‌కాడీ బాబును కూడ రమ్మన్నాను;—వాతనొప్పులు, చాలా బాధలో వున్నాడు—రాలేడట.

*  *  *

"రామ్‌రామ్ బాబూసాబ్!"

ఆగంతుకు నడిప్రాయం వాడు. శ్యామ వర్ణం, తెల్లని ధోవతి, దీర్ఘమైన నల్లబనాత్ కోటు, కాళ్ళకు పాలిష్ చేసిన బూట్లు, తలకు పసుపు పచ్చని తలగుడ్డ, ఒక చెవికి జంపు, నుదుటబొట్టు.

శ్యామ బాబు అన్నాడు—దయచేయండి, దయచేయండి, రాముడూ, యింకో కుర్చీ తీసుకురా.—వీరే అటల బాబుగారు, మన సొలిసిటర్ దత్తా అండ్ కంపెనీ భాగస్వాములు. మరి వీరు ముఖ్య మిత్రులు—బాబూ గండేరీ రామ్ బటపరియా.

గండేరీ:-రామ్‌రామ్ బాబూ సాబ్! మీ పేరిణ్ణాము, పరిచయం కలిగినందుకు సంతోషం.

అటల్:-రామ్, రామ్! మీ కోసమే మేము కూర్చునివున్నాము. మీబోటివారి సహాయంవుంటే కంపెనీనిగురించి యింకా ఆలోచించడం ఎందుకు?

గండేరీ:-హీఁ, హీఁ, అంతా భగవంతుణి హిచ్చ ణావొక్కడివళ్ళ హేమౌతుంది. హేమీకాదు.

శ్యామ:-నిజము అంతా భగవతి దుర్గ చేయవలసిందే. చూడు అటల్, గండేరీబాబు కేవలం వ్యాపరస్థుడే ననుకోబోకు- ఇంగ్లీషుబాగా రాకపోయినా చాల శిక్షితుడు. శాస్త్రాల్లోకూడ బాగా పరిచయం వుంది.

అటల్:-భలే, తమబోటివారితో పరిచయం గలిగినందుకు చాల సంతోషం కాని, బాబూ! తమరు యింత విశుద్ధమైనభాష ఎట్లా నేర్చుకున్నారు.

గండేరీ:-సాళామంది మీ వాళ్లతో కళుస్తూవుంటాము. పుస్తకాళుకూడ సాళా సదివాము. కాశీ మజిలీలు, అరేబియణ్ నైట్సు, యింకా సాళా-

యింతలో విపినబాబుకూడ వచ్చాడు. యితని స్వభావం కొంచెం దొరలది—ఒకప్పుడు విదేశాలు పోవటానికికూడ ప్రయత్నించాడు. తెల్లపట్లాం నల్లకోటు, ఎర్రనెక్‌టై, చేతిలోపచ్చని ఫెల్టుహేట్ ఉజ్వల శ్యామవర్ణం క్షీణకాయం, మీసాలు రెండుప్రక్కలా వత్తించాడు.

శ్యామబాబు ఆ దుర్గాగా అడిగాడు—'ఏమయింది?'

విపిన్:-డైరక్ట రవుతానన్నాడు; కాని రెండువేల రూపాయలకే షేర్లు తీసుకుంటానన్నాడు. నిన్ను, అటల్ని, నన్ను ఎల్లుండి భోజనానికి ఆహ్వానించాడు. యిదిగో వుత్తరం.

అటల్:-తీన్‌కాడీబాబు యింత వుదారుడా?

శ్యామ:-అర్థంకావడంలా ఫైలో డైరక్టర్లను కొంచెం తట్టి చూట్టానికేమో ననుకుంటా.

అటల్:-పోనివ్వండి, యిక పని మొదలెడదాము నేను మెమోరేండముకు, ఆర్టికిల్సుకు చిత్తు వ్రాసుకొచ్చాను. శ్యామ బాబూ! ప్రాస్పెక్టస్ ఎట్లా వ్రాశారో కొంచెం చదవండి.

శ్యామ:-అందరు సావధానంగా విని ఏమన్నా మార్చాల్సివుంటే చెప్పండి. దుర్గా—దుర్గా—

సిద్ధిదాతా శ్రీగణేశాయనమః

1913 సంవత్సరపు కంపెనీస్ ఆక్టుప్రకారం రిజిష్టరు చేయబడినది.

## శ్రీ శ్రీ సిద్ధేశ్వరీ లిమిటెడ్.

మూలధనం—పదిలక్షల రూపాయలు, 10/—చొప్పున 1,00,000 వాటాలుగా విభజింప బడినది, దరఖాస్తుతో పాటు వాటాకు రెండురూపాయలు యివ్వాలి. మిగతా డబ్బు నాలుగు కిస్తీలుగా, మూడు మాసాల నోటీసుతో, అవుసరాన్ని బట్టి యివ్వాల్సివుంటుంది.

### ప్రాస్పెక్టస్.

"ధర్మ (మత్స) మే హిందువులకు ప్రాణం. ధర్మాన్ని వేరు చేసి యీ జాతి ఏపని చేయలేదు. ధర్మ ఫలితం పరలోకంలో దొరుకుతుందంటారు, యిది కొంతవరకు నిజం. కాని మన ధర్మాన్ని సరియైన పద్ధతిలో వినియోగించితే, యిహ, పర, ద్వివిధాల లాభం పొందవచ్చు. అందువల్లనే, చాతుర్వర్ణాల లాభంకోసం దేశ వాసులను, యీ మహత్కార్యంలో పాల్గొంటానికై ఆహ్వానిస్తున్నాము.

"భారత దేశంలోని ప్రసిద్ధ దేవాలయాలకు ఎంతపెద్ద ఆదాయం వస్తూ వుందో సామాన్య ప్రజలకు తెలియదు. యీ ప్రాంతంలోని ఒక దేవాలయానికి వచ్చే యాత్రికుల సంఖ్య దినమునకు 15 వేలని రిపోర్టువల్ల తెలుస్తూంది. మనిషికి నాలుగణాలు చొప్పున పన్ను వేసినా, సంవత్సరానికి పదమూడున్నర లక్షల రూపాయల ఆదాయం వస్తుంది. కాని సాధారణ ప్రజలకు యీ డబ్బు మొక్కే మార్గమేమీ లేదు."

"దేశంలోని యీ గొప్పలోటును పూర్తిచేయటానికై 'శ్రీశ్రీ సిద్ధేశ్వరీ లిమిటెడ్' అను పేరుతో ఒక జాయింటు స్టాక్ కంపెనీ పెట్టుతున్నాము. ధర్మాభిమానులైన షేర్‌హోల్డర్ల రూపాయలతో ఒక గొప్ప తీర్థక్షేత్రాన్ని నిర్మిస్తాము. గొప్ప దేవాలయం కట్టించి, జాగ్రత దేవిని ప్రతిష్టింప జేస్తాము. ఒక యోగ్యుడును, అనుభవజ్ఞుడును అయిన మేనేజింగ్ ఏజంటుకు యీ కార్యభారం వప్పగించాము. ఏవిధంగాను దుర్వ్యయం అవుతుందని భయపడ నక్కర్లేదు. షేర్ హోల్డర్లు ఆశాతీత దక్షిణ లేక డివిడెండుతోపాటు ధర్మ-అర్థ- కామ- మోక్షాలు పొంది ధన్యులవుతారు.

డైరక్టర్లు:—(1) ప్రవీణ, విచక్షణ, రిటైర్డు డిప్యూటీ మేజిస్ట్రేటు రావు సాహెబ్ శ్రీయుత తీన్‌కాడీ వంద్యోపాధ్యాయ్- (2) విఖ్యాత వ్యాపారస్థులు, శ్రీయుత గండేరీ రామ్ బాట్‌పరియా. (3) సొలిసిటర్ దత్తా అండ్ కంపెనీ భాగస్థులు శ్రీయుత అటల విహారీ దత్తా M. B. A., L. (4) విఖ్యాత వైజ్ఞానికులు మిస్టర్ బి. సి. చౌధరీ B. Sc., A. S. S. U. S. A.), కాళీపదాశ్రిత సాధకులు శ్రీమత్ శ్యామానంద బ్రహ్మచారీ (Ex-officio.)

అటల బాబు అడ్డువచ్చి అడిగాడు.—విపినుడికి యీ క్రొత్త టైటిల్ ఎప్పుడొచ్చింది?

శ్యామ:—అరే, ఎందుకాగోల, యాభై రూపాయలు ఖర్చుపెట్టి అమెరికా నుంచో, కామ్‌స్కట్‌కా నుంచో—ఎక్కడినుంచో—మూడక్షరాలు తెప్పించాడు.

విపిన్:—బాగా చెప్పారు! వాళ్ళు నా క్వాలిఫికేషన్ చూడకుండానే యీ డిగ్రీ యిచ్చారనుకున్నారేం? డైరక్టరుగా వుండేప్పుడు ఒకటి అర పదవి వుంటం మంచిది కాదూ?

గండేరీ:—సత్యమ్. వేషం వేయందే బిచ్చం కూడ దొరకదు. శ్యామ బాబూ! మీరుకూడా ధోవతి గీవతి విప్పి లంగోటీ వేసుకోండి.

శ్యామ—నేనేం దిగంబర సన్యాసిని కాను, శక్తి మంత్ర సాధకుణ్ణి. నాకు రక్తాంబరాలు కావాలి. యింట్లో మాత్రమే కాషాయ వస్త్రాలు ధరిస్తున్నాను. ఆఫీసుకు వేసుకు వేసుకు రావడం లేదు. కారణం, ముండాకొడుకులంతా నావంకే చూస్తూ వుంటారు. యింకా కొంచెం పాతపడి పోతే ఎల్లప్పుడు కాషాయ గుడ్డలే ధరిస్తాను. పోనీయండి యీ సంభాషణ. చదువుతాను వినండి.—

"మెసర్సు బ్రహ్మచారీ అండ్ బ్రదర్—యిన్—లా, యీ కంపెనీ మేనేజింగ్ ఏజన్సీ తీసుకుంటానికి వప్పుకున్నారు.—యిది చాల సౌభాగ్యకరమైన విషయం. వారు లాభంలో నూటికి రెండు రూపాయలు మాత్రమే తీసుకుంటారు. కాని.—"

—"కమీషన్ రేటు యింత తగ్గించారెందుకు? టెన్‌పర్సంట్ అనాయాసంగా వుంచొచ్చే? అటలబాబన్నాడు.

గండేరీ:- అఖర్లా. శ్యామబాబుకు వేరే జీవనాధార ముంది. కమీషనుమీద నాడే బ్రతికాడు.

"కాని కమీషను మాసానికి 1000/—రూపాయలు రాని యెడల లోటు ఎలవెన్సుక్రింద తీసుకుంటారు."

గండేరీ—విన్నారూ, అటళబాబు విన్నారూ! మీరు శ్యామబాబు కేమి చేర్పుతారు?

"హుగ్లీ జిల్లాలో వుండే గోవిందపుర గ్రామంలో చాల శతాబ్దాల క్రిందట ప్రతిష్టింపబడిన శ్రీశ్రీ సిద్ధేశ్వరీ దేవి ఆలయం వున్నది. దేవాలయం, దానిసే అనుకొనివున్న దేవోత్తర సంపత్తికి స్వత్వాధికారిణియైన నిస్తారిణీ దేవికి, యీ మధ్య సిద్ధేశ్వరీ దేవి స్వప్నంలో సాక్షాత్కరించి, గోవిందపుర గ్రామంలో సర్వ పీఠాలు సమన్వయం అయినవనీ, తాను తన మహాత్మ్యంతోపాటు యీ దేవాలయంలో వసింప దలచుకున్నానని చెప్పింది. నిస్తారిణీ దేవి అబల కావడంవల్ల, స్వయంగా దైవాదేశం పాలించడంలో అశక్తురాలు కావడంవల్ల, పై దేవోత్తర సంపత్తి, దానిలో వుండే దేవాలయం, విగ్రహం, యితర స్థిర చరాస్తులు యీ లిమిటెడ్ కంపెనీకి సమర్పించ దలచుకుంది."

అటల్:—నిస్తారిణీ దేవి ఎక్కనుండి వూడి పడింది? ఆ ఆస్తి, మీదనే అనుకుంటున్నానే.

శ్యామ—నాభార్యే. కొద్దిరోజుల క్రిందట అంతా ఆమె పేరనే వ్రాసేశాను. యిక నేనీ జంఝాటాల్లో యిరుక్కోదలచుకోలేదు.

గండేరీ:—బందోబస్తు బాగా చేశారు. మీమీద కోపం ఎవ్వరూ వేయరు. నిస్తారిణీదేవిని ఎవరెరుగుదురు?—ధరేమాత్రం సిటల్ (సెటిల్) అయ్యింది?

"యిక్కడినుండి తీర్థప్రతిష్ట, దేవాలయ నిర్మాణం, దేవీ సేవాదులు కంపెనీ ద్వారా నిర్వర్తింప బడతవి. యీ ఆస్తిని కంపెనీ, కేవలం 15000/—లకు కొంటానికి యిష్టపడి బయానా కూడ యిచ్చింది.

గండేరీ:—ముంచారు శ్యామ బాబూ! హడ్డీలో పాడుపడ్డ గుడి, బెత్తెడు నేల—హందులో వెదురు తప్పితే లేదు—ధర పదిహేను వేలా!

శ్యామ:—ఏం, అన్యాయ మేముంది? స్వప్నాదేశం, సర్వపీఠ సమన్వయం, జాగ్రత దేవి—యివన్నీ వూరకనే వస్తాయా? 'గుడ్ విల్' ప్రకారం చూచినా పదిహేను వేలు ఒక లెఖ కాదు.

గండేరీ:—సరే, స్వప్నం హబద్ధం, దగా చేసి రూపాయలు కాజేశాడని ఏ షేర్ హోల్డరన్నా హైకోర్టులో పిటీషను పెట్టితే?

అటల్:—నిజంగా యిది ఆలోచించాల్సిందే. యీ అధిదైవిక వ్యాపారాలన్నీ 'ఒరిజినల్ సైడ్ జ్యూరిస్ డిక్షన్'లోకి రావు. caveat emptor అంటే క్రేతా జాగర్త!-అని చట్టం చెప్తూంది. వస్తువు కొనేటప్పుడే ఎందుకు విచారించలేదు? ఏమైనా కాని యిందులో Expert opinion తీసుకోవాలి.

"త్వరలోనే దేవాలయపు పని ప్రారంభమవుతుంది. దానితోపాటు ప్రశస్తమైన నాట్యశాల, నౌబత్ ఖానా, భోగశాల, భండార గృహం, మొదలగు యితర కట్టడాలు కూడ నిర్మింపబడతాయి. ప్రస్తుతం పదిహేను వేలమంది వుంటానికి వీలైన అతిథిశాల వొకటి నిర్మిస్తాము. షేర్ హోల్డర్లు దమ్మిడీ ఖర్చు లేకుండా సపరివారంగా అందులో వుండవచ్చు. అంగళ్లు, వీధిభాగవతులు, థియేటర్లు, సినిమా మొదలగు ఆమోద ప్రమోదాలు కూడ ఏర్పాటు చేయబడతాయి. ఎవరైనా దైవాదేశం వల్లకాని, ఔషధ ప్రాప్తికోసం గాని బలియివ్వదలచుకొంటే-వైజ్ఞానికంగా ఏర్పాట్లు చేయిస్తాము. సారాంశము తీర్థయాత్రికులను ఆకర్షింపగల అన్ని ఏర్పాటులు చేయబడతాయి. స్వయంగా శ్రీమత్ శ్యామానంద బ్రహ్మచారిగారు దేవీసేవలో నియుక్తులై యుంటారు.

"యాత్రికుల దగ్గరనుంచి వచ్చే కట్నాలు, కానుకలూ ఎట్లానూ వస్తాయి, యివికాక యింకా చాల విధాల రాబడి వుంటుంది. దుకాణాలు, అతిథిశాల, సినిమాలు, మహా ప్రసాద విక్రయం-మొదలగు వాటివల్ల చాలడబ్బు వస్తుంది. యింతేకాక By- product recovery కూడ వుంటుంది. దేవీ పూజకై వినియోగింపబడ్డ పూలనుండి అత్తరు తీయిస్తాము. ప్రసాదం బిల్వపత్రాల్లో కట్టి అమ్ముతాము. చరణామృతం సీసాల్లో ప్యాకుచేస్తాము. బలియివ్వబడ్డ మేకపిల్లల చర్మం పూనించి ఉత్కృష్టమైన కిడ్ స్కిన్ తయారు చేయించి ఎక్కువ వెలకు విదేశాలు పంపిస్తాము. ఎముకలతో గుండీలు చేయిస్తాము. ఏవస్తువును కూడ వృథాపోనీయము.

గండేరీ:—హేంటీ, మేటల్ని కోస్తారూ? రామ్. రామ్! మేమిందుళ్లో వుండము. మా పేరు కొట్టేయండి,

శ్యామ:-మీరేమీ స్వయంగా బలియివ్వడం లేదుగా-సరే, అట్లయితే గుమ్మడికాయలే బలిచ్చేటట్టు ఏర్పాటు చేస్తాము.

అటల్:-గుమ్మడికాయల్లోంచి చర్మం నాడే వచ్చింది! ఆదాయం తగ్గిపోతుంది-ఏమోయ్ సైంటిస్ట్! గుమ్మడికాయల్లోంచి చర్మం తీయొచ్చా?

విపిన్:-కాస్టిక్ పొటాష్ వేసి బాయిల్ చేస్తే బహుశ వెజిటబుల్ షూ తయారు కావచ్చు ఎక్స్పర్మెంట్ చేసి చూస్తాను.

గండేరీ:-మీ యిష్టం వచ్చింది చేసుకోండి, మాకేం? మేం కొద్దిరోజు లుణ్ణాక మా షేర్లణ్ణీ అమ్మేస్తాము.

"లెఖ్ఖలు వేసిచూస్తే కంపెనీకి సంవత్సరానికి పన్నెండులక్షల రూపాయల ఆదాయం వస్తుందని తేలింది. యిట్లయితే సునాయాసంగా 100%(నూటికి నూరు) డివిడెండ్ యిస్తాము. 15వేల షేర్లు ఖర్చు కాగానే ALL OTMENT వేస్తాము. వెంటనే షేర్లకోసం ధరఖాస్తు పెట్టుకోండి. ఆలసించితే ఆశాభంగం"

గండేరీ:-వ్రాసేయండి-రెండు లక్షలణ్ణర రూపాయల షేర్లు ఖర్చైణాయని. మేం లక్ష తీసుకుంటాము. మిగతా లక్షణ్ణర, శ్యామబాబూ, విపిణ బాబు, అటళ బాబు-ఒక్కొక్కళ్ళు యాభైయాభై వేళు.

శ్యామ:-పిచ్చా ఏమిటి? నేనూ విపిన్ యాభై యాభై వేలు ఎక్కడినుంచి తెస్తాము? మీకేం గొప్ప వారు-

గండేరీ:-మేం ముండా కొడుకుళం డబ్బుపెట్టితే మీరు తమాషా చూద్దా మనుకున్నారూ? అది వళ్ళ కాదు. అందరం సమానంగా అనుభవించాల్సిందే. అర్థంకాలా శ్యామబాబూ? డబ్బు ఎవ్వరూ యివ్వరు. అంతా పద్దుల్లో కనపడాల్సిందే మేనేజింగ్ ఏజంట్సుకు అప్పుపడతాము.

అటల్:-యింకా తెలియలా శ్యామబాబూ? మన మందరము మేనేజింగ్ ఏజంట్సు దగ్గరనుండి అప్పు తెచ్చి కంపెనీకి యిచ్చాము; కంపెనీ ఆడబ్బు మేనేజింగ్ ఏజంట్సుదగ్గర దాస్తుంది. జేబులోనుంచి దమ్మిడీ తియనక్కర్లా డబ్బంతా ఖాతాలో జమాఖర్చె వుంటుంది.

శ్యామ:-తర్వాత ఆడబ్బంతా ఎవరినెత్తిన పడుతుంది? కంపెనీ 'ఫేల్' అయితే నేను మునగాల్సిందేగా! మిగతా'కాల్సు'డబ్బు ఎక్కడనుంచి తెస్తాను?

గండేరీ:-భయపడతా రెందుకు? షేరుకు రెండు రూపాయలేగా యిప్పుడివ్వాల్సింది. రెండు లక్షలణ్ణరకు యాభైవేలిస్తేచాలు. ప్రిమియములో అణ్ణే అమ్మేద్దాము-వీలుగావుంటే యింకా కొణ్ణిషేర్లు అట్టేపెట్టుకుందాము, చాలా లాభంవస్తుంది. రెండుమూడుసార్లు మాలో మేము షేర్లు అటుయిటు మార్చుకుంటాము. చమడీమల్ బ్రోకరుతో చెప్పి వుంచాను, ధర పెరుగుతుంది. అప్పుడందరు షేర్లు కావాలంటారు. ధరెవ్వరూ చూడరు, కబీరుగారివచణం వినండి-

"ఐసీగతి సంసారమేఁ, జ్యాఁగా డరకీ ఠాట్,
ఏక్ పడాజబ్ గాఢమేఁ, సబైజాతతెహి బాట్"

అర్థమేమంటే:-ప్రపంచంలో ప్రజలందరు గొఱ్ఱెల్లాంటి వాళ్లు, ఒక్క గొఱ్ఱె గనుక గోతిలో పడితే అణ్ణీపోయి గోతిలో పడతై.

శ్యామ బాబు దీర్ఘమైన నిట్టూర్పు విడిచి అన్నాడు—భగవతీ బ్రహ్మమయీ! నేను నిమిత్త మాత్రుణ్ణి. నీపని, నీవే ఉద్ధరించుకోవాలి తల్లీ- యీ అధమ సంతానాన్ని వేధించి చంపబోకు.

గండేరీ:- శ్యామబాబు! గుడిగిడీ కంపెనీ ఎటూ చేస్తూ వుంది. దీనితోపాటు'ణీయి' వ్యాపారం కూడ చేయండి, రూపాయికి రూపాయి లాభం వుంటుంది.

అటల్:- ణీయి "ఏమిటి?

గండేరీ:- ణీయి తెల్వదూ? నెయ్యి అంటే అసలుది, ఆవుగేదె, మేకపాళతో తయారు చేస్తారు. ణకలు దాణ్ని ణీయి అంటారు. కొవ్వు బాదముణూణె మొదళగుణయి కళిపి తయారు చేస్తారు. క్రిందటి సంవత్సరం మేము యీ వ్యాపారంలో పాతికవేళు పెట్టుబడి పెట్టాము. యిరవైణాలుగు వేళన్నర లాభం వచ్చింది.

అటల:- ఓః! చాలా పాముల్ని చంపారన్న మాట!

గండేరీ:- అరే యిణ్ణీ పాములు ఎక్కడణుంచి దొరుకుతై. అంతా అబద్ధం.

అటల్:- సరే, గండాజీ...

గండేరీ:- గండార్ కాదు- గండేరీ.

అటల:- గండేరీజీ, బెగ్ యువర్ పార్డన్. కాని మీరు శాఖా హారులు, బొట్టు పెట్టారు, పూజ చేస్తారు...

గండేరీ:- ఎందుకు చేయణూ? రోజు గీత చదువుతాణు, భాగవతం చదువుతాణు, రామభజణ కూడ చేస్తాను.

అటల:- అయితే యిటువంటి పాప వ్యాపారం ఎందుకు చేస్తున్నారు?

గండేరీ:- పాపం? ణాకెందు తగుళ్తుంది? వ్యాపారం చేసేది కాసిం ఆలీ. మేం కళకత్తాలో వుంటాము, ణీయి కాసిలో తయారౌతుంది. మేం ముక్కుతో పీళ్చణూ లేదు, కంటితో చూడనూ లేదు. మేం పెట్టుబడి దారులమెం. డబ్బివ్వటంతో మాపణి 'కళోస్' (close) తీరిపోతుంది. వడ్డీ తీసుకుంటాము, లాభంకూడ సగం తీసుకుంటాము. మేం డబ్బివ్వకపోతే కాసిం ఆలీ యింకొకడి దగ్గర తెచ్చుకుంటాడు. పాపం చుట్టుకుంటే సాలా కాసింఆలీకి చుట్టుకుంటుంది. నాకేం?- అయిదో పాపం చుట్టుకోటాణికి మేంచేసిణ పుణ్యం కూడ చాలావుంది. ఏకాదశీ, శివరాత్రీ ఉపవాసాల్లు,

దానధర్మాళు, చాళాచేశాము. ఏడెనిమిది సత్రాలు కూడ కట్టించాము. ళిళువాళో, బాలీలో, శివుడా పులిలో–

అటల్:–లిలువాలో సత్రం శర్ఫీలాల్ టుస్‌టున్‌వాలాకాదూ కట్టించింది.

గండేరీ:–కట్టిస్తే ఏమయినట్టు? పేరుకు అణ్ణీఅతణే! యింజణీర్లని ఎవరుపిల్చారు? కంట్రాక్టర్లని ఎవరు తీసుకువచ్చారు? సామాను ఎవరుకొన్నారు? అంతా మేమే అశర్ఫీ మాకు వేళిడిచిన మేనమామకొడుకు; మేం సలహా యిస్తేనే వాడు డబ్బుపెట్టాడు!

అటల:–బాగావుంది—డబ్బుపెట్టింది అశర్ఫీ, పుణ్యం వచ్చింది గండేరీకి!

గండేరీ:–ఎందుకురాదూ? ఒక్కొక్క చోట రెండు రెండులక్షళు ఖర్చుపెట్టాము. కళపండి ఎంతయిందో? వాటిమీదణూటికి 5%కమీషన్ వేయండి మేం దమ్మిడీకూడ తీసుకోలేదు–వదిళేశాము. అర్ఫీ పుణ్యం యొనబై వేలు వుండాలి.

అటల:–భళేపద్దతి! పుణ్యంలోకూడ కమీషన్! మన శ్యామబాబు, గండేరీబాబు–రెండు రెండు మాణిక్యాలే.

గండేరి:– అటలబాబూ! మీరు రెండు మూడు ఇంగ్లీషు పుస్తకాలు చదివి మాకు ధర్మం ఏమి నేర్పుతారు? తెళుగువాళ్ళకు ధర్మం అంటే ఏమిటో తెలియదు: ముప్పై రూపాయళకు గుమస్తాగిరీ చేయటం, ముక్కాణీ కొబ్బరికాయతో దేవుడి మొక్కు–తీర్చుకోవడం. మాజాతి డబ్బు సంపాయించినా లెఖ ప్రకారమే, పుణ్యంచేసినా లెఖప్రకారమే.—సరే. పోతుణ్ణాం. రేసుకు పోవాళి. కంట్రీగరల్ మీద ఒక వంద వేయాళి యివ్వాళ.

అటల:–నేనూ వెళ్తున్నా శ్యామబాబు. అర్టికిల్సు చిత్తు అట్టేపెట్టి పోతున్నా, చూచి వుంచండి. 'ప్రాస్‌పెక్టస్' దివ్యంగా వుంది. కొద్దిగా మార్చాల్సి వుంటుంది– ఎల్లుండి చూద్దాములే.– గుడ్ బై.

* * *

బాగ్ బజారులోవుండే చిన్నసందులో రావుసాహెబు తీన్‌కాడీబాబుగారియిల్లు వుంది. క్రింద అంతస్తులోని ఒక చిన్నగదిలో గృహ యజమాని, అతిథులు సంభాషణలో మునిగి వున్నారు.– లోపలినుంచి భోజనపు పిలుపు ఎప్పుడువస్తుందా అని ఎదురుకూడ చూస్తూవున్నారు! యివ్వాళ ఆదివారం, తొందర ఏమీలేదు–వేళకూడ చాల మిగిలిపోయింది.

తీన్‌కాడీబాబు అరవై వత్సరాల ప్రాయంవాడు. దుర్బలంగా వుంటాడు. గడ్డం గొరిగించాడు యివ్వాళే. పల్చనిమీసాలు చుట్టపొగవల్ల ఖర్జూరపు రంగుకు వచ్చేసినై—మాట్లాడేటప్పుడు బొద్దింకల మీసాలు మాదిరిగా కదులుతూవున్నై. వీరు దైవంమీద భారం వేసి చేసే వ్యాపారాల్ని విశ్వసింపరు. శ్యామబాబుతో మొదటే యీవిషయం చెప్పేశాడు–తాను కేవలం లాభంకోసమే యీకంపెనీలో చేరానని. కాని యీ వేళ కాళీ ఘట్టంలో స్నానంచేసి వచ్చిన శ్యామబాబు అభినవమూర్తినిచూచి అతనివైపు కొద్దిగా ఆకర్షింపబడ్డాడు. శ్యామబాబు ఎర్రని అంగరఖా, కావిరంగు శాలువా, కాళ్లకు పులితోలు స్లిప్పర్లు వేసుకున్నాడు. గడ్డం, జుట్టు, గంగామృత్తికతో స్నానంచేయడంవల్ల–వెంట్రుకలు విరజిమ్ముకున్నై. ముఖాన పెద్ద పసుపుబొట్టు.

తీన్‌కాడీబాబు పొగపీలుస్తూ మధ్య మధ్య అంటున్నాడు–చూడండి స్వామిగారు! వ్యాపారానికి లెఖలుప్రాణం. డెబిట్, క్రెడిట్ తేలివుండి, బేలన్సుసరిగా కలిస్తే ఇక ఆ బిజినెస్‌కు భయమేమీ వుండదు.

శ్యామ:– చిత్తం. వాస్తవమైన సంగతే సెలవిచ్చారు. అందుకేగా మిమ్మల్ని కోరుతూంది. లెఖల విషయంలో సలహా తీసుకుంటానికి మధ్యమధ్య వచ్చి మిమ్మల్ని కష్టపెడుతూ వుంటాము.

తీన్:– భేషుగ్గా! కష్టమెందుకు? మీ ఎకౌంట్సన్నీ నేనే చూస్తాను. మీటింగులు కొంచెం త్వర త్వరగా వేయండి– డైరెక్టర్ల ఫీజు కొంచెం ఎక్కువైతే అవుతుంది. చూడండి, ఆడిటర్లు గీడిటర్లు అంటే నేను వప్పుకోను. అరే బాబు! మన లెఖలు మనకు తెలియకపోతే క్రొత్తవాడొకడు వచ్చి మనకేం చెపుతాడు? యిప్పుడంతా పెద్ద 'బుక్కీపింగు' చదువు

తున్నారు! మీకేం తెలుసు, అదంతా పేచీ కోరు వ్యవహారం. ఎవరికీ తెలియకూడదనే వాళ్ళ కోరిక! నా లెఖలేమిటో తెలుసునా? రోజుకు ఎంత వస్తోంది, ఎంత ఖర్చవుతోంది, ఎంత మిగులుతోంది? నేను అమడాగాచి సబ్‌డివిజన్, ట్రెజరీ- యిన్‌చార్జిగా వుండగా, కాలేజీలో ప్యాసయిన కుర్ర డిప్టీ ఒక డొచ్చాడు- నాదగ్గర పని నేర్చుకోవడానికి కుర్రకుంకయినా తలతిక్క మాత్రం చాలా వుంది. చూడండి వాడి గుండె, నా పనిలో తప్పులు వెతక సాగాడు! ఆఖరికి నేను కోల్డుహామ్ దొరగారికి వ్రాయాల్సి వచ్చింది- 'అయ్యా మీరు రాజవంశీయులు, తమరు రెండు తన్నినా పడతాము. కాని దేశీ కుక్కల అరపులు కూడ సహించము.' అప్పుడు దొరగారు స్వయంగా వచ్చి సంగతంతా తెల్సుకుని, వెధవాయిని చాటుకు పిల్చి బాగా బుద్ధి చెప్పాడు. నన్ను వీపుతట్టి నవ్వుతూ అన్నాడు- 'వెల్ తీన్‌కాడీ బాబు! నీవు చాలాకాలంనుంచి వున్న సీనియర్ ఆఫీసరువి, ఒక యంగ్ ఛాప్‌కు నీ గౌరవం ఏం తెలుస్తుంది.'- తర్వాత నన్ను నౌగాంవ్ ఆ బ్కారీ డిపార్టుమెంటులో వేశారు. పోనీయండి ఆ గోల. ——చూడండి శ్యామబాబుగారు! నేను చాల ఖచ్చితం అయినవాణ్ణి, 'కరక్టు' ఆఫీసరని నాకు పేరు వుండేది. గుడిగోపురం నాకేమీ తెలియదు. ఒక్క రూపాయి కూడ నన్ను దగాచేసి ఎవ్వరూ తీసుకోలేరు. చమటవోడిచి సంపాయించినడబ్బు, మీ దోసిట్లో పోస్తున్నాను. ఎక్కడన్నా-

శ్యామ:- అదెక్కడి సంగతి! మీడబ్బు మీకు నూరు రెట్లు ఎక్కువగా పెరిగివస్తుంది. మమ్మల్ని చూడరాదూ- నాకున్న పిత్రార్జితం యాభై వేలు యిందులోనే పెట్టేశాను. అయినా నాతో ఎట్లా? నేను సర్వం త్యజించిన సన్యాసిని- నాకు డబ్బుతో అవుసరం లేదు- వచ్చిన లాభంకూడ దేవీ సేవకే ఖర్చుపెట్టుతాను. విపినుడు, అటలుడు కూడ ఒకొక్కరు యాభై యాభై వేలకు తీసుకున్నారు. గండేరీ లక్ష రూపాలకు తీసుకున్నాడు. అతడు చాల లెఖగాడు.- లాభం లేదనుకుంటే ఎందుకు తీసుకుంటాడు?

తీన్:- నిజంగా? కాస్త నమ్మకం కలుగుతూందిప్పుడు. అయినా వకసారి కోల్డుహామ్ దొరగారిని కన్సల్టుచేసి చూడవచ్చూ? అటువంటి దొర దొరకడు

——'భోజనం తయారైంది, నౌకరు వచ్చి చెప్పాడు.

'యిక లేవండి బ్రహ్మచారిగారూ! దయచేయండి అటల బాబు, పదవోయి విపిన్.'- తీన్‌కాడీబాబు అందరను పిల్చుకొని గదిలోనికి వెళ్ళాడు.

శ్యామ:- రాజసూయ యజ్ఞానికి చేసినంత చేసారే! యింత చేయాల్సిన అవుసరం యేముంది?- కూర్చోండి తమరుకూడ.

తీన్:-వాతనొప్పులు కదూ, అన్నం మానేశాను. రొట్టె మాత్రమే తింటున్నా.

శ్యామ:- మీ కొక దుర్గా కవచం పంపుతా- కట్టుకు చూడండి.

——పప్పు, పులుసు, కూర, అన్నం.- యిదేమిటి పనసకూరా? తీసేయాల్సి వస్తుందేమోనే. చక్కగా పండిన అరటిపండ్లు, ఆవునేయి, యింట్లో వున్నాయా?- 'పనసే కదలీం కదలే ఘృతం'- అయుర్వేదంలో వుంది. కదలీఫలాలు తింటే పనసదోషం పోతుంది- తర్వాత నేతివల్ల కదలీ ఫలాల శైత్యం హరిస్తుంది...పుంటీ చేపలకూరా- వాహ్వా!- -'రోహితాద పిరోచకాః పుంటికాః సద్య భర్జితాః-' అదేమిటి వంకాయా? నాశనం చేశారే. యిది క్రిందటి సంవత్సరమే గయలో వదిలాను.- అసలు నాకిది సరిపడేది కూడ కాదు శ్లేష్మం ప్రకోపింప జేస్తుంది.- పున్, పున్, పున్, ప్రాణాయ, అపానాయ, సోపానాయ స్వాహా. 'శయనే పద్మనాభంచ భోజనేతు జనార్దనమ్' ఆరంభించవోయ్ అటల్.

అట:-(జనాంతికంగా) ఏం ఆరంభించేది? యింటికి పోయి మళ్లీ ఆకలి తీర్చుకోవల్సి వచ్చేటట్టుంది.

తీన్:-ఒకటి అడగటం మర్చిపోయానండీ స్వామిగారూ! మీ తంత్రశాస్త్రింలో మనుష్యుల మాన-మర్యాదలు వృద్ధిపొందటానికి ఏదన్నా క్రియవుందా?

శ్యామ:-తప్పకుండా వుంది. 'అమానినామానదేన' యధాకులార్ణవం-అంటే కులకుండలిని మేల్కొలిపితే అమాన్సవక్తికూడ గౌరవింపబడుతాడు- ఎందుకు చెప్పండి?

టీన్:-అహహ, యిదేమిటి స్వల్ప విషయం. కొంచెంపీలు చిక్కంగానే వైస్రాయికి చెప్పి పెద్ద బిరుదు యిప్పిస్తానని కోల్డుహామ్ దొరచెప్పాడు. మాటి మాటికి రిమైండ్ చేయటం బాగాలేదు. తంత్రాలంటే నాకు నమ్మకంలేదు-అయినా...

శ్యామ:-నమ్మకపోవడం ఏమిటి? శాస్త్రాలు అబద్ధాలుకావు. యీ విషయం నాశక్తంతా వినియోగిస్తాను-మీరు నిశ్చింతగా వుండండి. అయినా సద్గురువును ఆశ్రయించాలి. వీళ్ళులేంది పనికాదు. గురువులు కూడ ఆర్డినరీ రకం పనికిరారు. పోతేఖర్చు-అది నేను సాధ్యమైనంతవరకు తేలికలోనే ముగిస్తాను.

టీన్:-సరే, చూస్తాముగా-మీ ఆఫీసులోకి చాల మంది కావల్సివుండొచ్చు మా మరదలు కొడుకు వకడు చెడుసహవాసంచేసి పాడయి పోతున్నాడు. చదువూలేదు సంధ్యాలేదు. ఊరకకూర్చుని అన్నమంతా ధ్వంసం చేస్తున్నాడు. ఎందులోనన్నా యిరికిస్తే బాగుపడకపోతాడా అని చూస్తున్నా మంచి నమ్మకస్తుడు.

శ్యామ:-మీ మరదలుకొడుకా? యింకాచెప్పడం ఎందుకు? నేను వాణ్ణి దేవాలయానికి హెడ్ పండాగా వేస్తాను. యిదివరకే పది, పదిహేను దరఖాస్తులు వచ్చినై-అందులో అయిదుగురు గ్రాడ్యుయేట్లు అయినా మీవాడి 'క్లెయిమ్' ముందు.

టీన్:-యింకోమనవి: నాదగ్గర ఒక పాత గడియారం వుంది. యిప్పుడు ఆడటంలేదుగాని ఫస్టుక్లాసయిన వుక్కు, దేవాలయం క్రిందకు తీసుకుంటే చాల చౌకగా అమ్ముతాను.

శ్యామ:-యింకేం! దాన్ని తప్పకుండా తీసుకుంటాం; అంతపురాతన వస్తువు యిప్పుడు కావాలంటే ఎక్కడ దొరుకుతుంది.

* * *

గండేరీరామ్ చెప్పినజోస్యం సఫలమైంది. ప్రకటన్లబలంవల్ల కాని ప్రతిష్టిత మనుష్యుల పేరువల్లకాని షేర్లన్నీ ఖర్చయినవి. షేర్లకోసం ప్రజలు కొట్టుకు చస్తున్నారు. రెట్టింపు ధరలకు అమ్ముడు పోతూవున్నై.

"ఏమండీ శ్యామబాబుగారు! యిక మనం షేర్లు అమ్ముకుందామా? గండేరీ మంచి లాటుకొట్టేశాడు! యివ్వాళ డబల్ ధర వుంది, రెండు రోజులుంటే ఏమవుతుందో తెలియదు" అని అటలబాబు అడిగాడు.

శ్యామ:-అమ్మదల్చుకుంటే అమ్మేశేయి. డైరక్టరుగా వుండాలంటే కొన్ని వుంచుకోవల్సి వుంటుంది.

అటల:-డైరక్టర్లుగా మీరు వుండండి. నేనిక యిందులో యిరుక్కో దల్చుకోలేదు. సిద్ధేశ్వరి కృప వల్ల మీకార్యసిద్ధి అయిందిగా.

శ్యామ:-యిప్పుడింకా ఆరంభమే గుడి-గోపురం, భవనాలు-గినవాలు యింకా కట్టించవల్సే వుంది. నిన్ను అప్పుడే ఎట్లా వదుల్తాము!

అట:-వుంటే నాకులాభం? పొట్టలోకి పోతుంటే వీపుమీద పడుతున్నా ఫరవాలేదు. యిప్పుడు బ్రదర్ యిన్-లా కంపెనీ సీజన్ మాదియింతటితో ఆఖరు.

శ్యామ:-అరే ఎందుకంత తొందర? ఒక్క పడవలో ఎక్కినాక ఒకడు మునగటం ఎట్లా?-సాయంత్రం గండేరీరామ్‌నుకూడ తీసుకుని మీయింటికి వస్తాను.

* * *

సంవత్సరంన్నర గడిచింది. బ్రహ్మచారీ అండ్ బ్రదర్-యిన్‌లా కంపెనీ ఆఫీసులో డైరక్టర్ల మీటింగు జరుగుతూ వుంది.

సభాపతి టీన్‌కాడీబాబు బల్ల గుద్దుతూ అడుగుతూ వున్నాడు— నే-నే-నే నడిగే దేమంటే- యీ డబ్బంతా ఎక్కడికి పోయిందని? నేను యింట్లో వుండటం కష్టమైంది. అందరూ వచ్చి డబ్బు నన్నడిగేవాళ్ళే. కట్టెలవాడు 15 వేలంటే యిటుకవాడు 12వేలు. యిక అచ్చు ఆఫీసువాళ్ళు, షార్పర్ కంపెనీ, చౌదరీ అండ్ సన్స్- ఒకటేమిటి, అందరకూ అప్పులే! ప్రతివాడు హైకోర్టువరకు లాగి గాని వదల నంటున్నాడు. గుడి గుడం అయిందో కూడ తెలియదు- రెండు లక్షలు యెగిరిపోయినై. ఆ మాయలపకీ రెక్కడకు వెళ్లాడు? ఎందులోనన్నా పడి చచ్చాడా? ఆఫీసులో కనపడడు!

ఆటల:-దేవి తనను యింకోపనికి పిల్చిందని మిస్టర్ బ్రహ్మచారీ చెపుతూన్నాడు. యిందులో మునుపుటంత వుత్సాహంలేదు. బహుశ యివ్వాళ మీటింగుకు రావచ్చు!

విపిన్:-ఎందుకుసార్ అంతగాభరా పడతారు? యివిగో చూడరాదూ పద్దులు. భూమి కొన్నది, షేర్లకు కమీషను, preliminary expence యిటుక తీయటానికి, establishment, యడ్వర్టైజ్‌మెంటు, ఆఫీసుఖర్చు-

తీన్:-నోరుమూయవోయ్ పక్షీ, మూటలు కత్తిరించే వాడికి జేబులు కొట్టేవాడు సాక్ష్యం.

యింతలో శ్యామబాబువచ్చి అడిగాడు-ఏమిటి వ్యవహారం?

తీన్:-వ్యవహారంకాదు తలకాయ! మాకు ఎకౌంట్సు కావాలి ఎకౌంట్సు!!

శ్యామ:-యింతకంటె మనకు కావల్సిందేమిటి? ఒక్కసారి గోవిందపురంవచ్చి చూడగూడదూ, లెఖలు కళ్లకు కనబడతై.

తీన్:-బాగావుంది? యీ వాతనొప్పుల్తో ఆ అడవిలోకిపోతే ఎప్పుడో చచ్చేవాణ్ణి యిప్పుడేచస్తాను! మా కివన్నీ అఖర్లా-మాడబ్బు మాకు పారెయ్యండి. కంపెనీ దివాళా ఎత్తటానికి సిద్ధంగావుంది. షేర్ హోల్డర్లు గోల పెట్టున్నారు.

శ్యామబాబు రెండుచేతులు నెత్తినకొట్టుకొని చెప్పసాగాడు-అంతా జగన్మాత కోరికమీద ఆధారపడివుంది! మానవుడు తల్చేదొకటి జరిగేదొకటి. యిప్పటికెప్పుడో దేవాలయం తయారుకావల్సింది. అనేక అజ్ఞాతకారణాలవల్ల ఖర్చు ఎక్కువైంది. యిందులో మన తప్పేముంది? యిక దీని విషయమై దిగులుపడ నక్కర్లా అంతా సరైపోతుంది. Second-call డబ్బు రాగానే అప్పులు తీరతై-పనికూడ టకటక జరిగిపోతుంది.

గండేరీ:-యిక డబ్బెవరు యివ్వరు-మీరంటే నమ్మకం కూడా పోయింది.

శ్యామ:-ఎవరూ నమ్మకపోతే ఏంచేస్తాం? నేనిక యీభారం వదిలేస్తాను-జగన్మాత యిష్టప్రకారం పని జరుగుతుంది. నన్ను కాశీవిశ్వనాథుడు తనవైపుకు లాగుతున్నాడు. అక్కడికేపోయి, వారి నే ఆశ్రయస్తాను.

తీన్-మీరు చెప్పేది యిక, కంపెనీ మునిగిందనేనా?

గండేరీ:-పదిహేను నిలువులలోతులో.

శ్యామ:-సరే రావుసాహెబుగారు! మమ్మల్ని పబ్లిక్ విశ్వసింపకపోతే, మేము మేనేజింగ్ ఏజన్సీ వదిలేస్తున్నాము. బజారులో మీకు పేరుంది, పలుకుబడి వుంది. ప్రజలు మిమ్మల్ని గౌరవంగాకూడ చూస్తారు. మీరే మేనేజింగ్ ఏజంట్లయి కంపెనీని ఎందుకు నడపకూడదూ?

అట:-యీమాట బాగావుంది.

తీన్:-నేనీ చెడుపేరంతా నెత్తినేసుకొని, యింట్లో తింటూ అడవిలో గొడ్లకాయ మంటారా?

శ్యామ:- మీరు వెట్టిచాకిరి చేయడం ఎందుకు? యీ మీటింగులో నేను రిజల్యూషన్ పెట్టుతున్నా-'రావు సాహెబు తీన్‌కాడీ బెనర్జీ గారికి మాసానికి వేయి రూపాయలు జీతం యిచ్చి, కంపెనీ నడిపే భారం వారికి వప్పగిస్తున్నాము. యిటువంటి కార్య కుశలురు దొరకటం దుర్లభం' అని. మావల్ల ఏమైనా పొరపాట్లు జరిగివుంటే మీరేమీ బాధ్యులు కారు!

తీన్:- అ-అ- అయితే నే నిప్పుడు ఏమీ మాట యివ్వను. ఆలోచించుకు చెప్తా.

అట:- యిక మీరు సందేహించకండీ రావు సాహెబుగారు! యిప్పుడు మీరే ఆధారం.

శ్యామ:-మీరు ఆజ్ఞయిస్తే యింకోసంగతి కూడ చెప్తాను. ధనమే ముక్తి సాధనకు అడ్డమని బాగా ఆలోచించిన మీదట నాకు తెల్సింది. నా ఆస్తంతా యిదివరకే దానం చేశాను. యిక యీ కంపెనీ షేర్లే 1600 దిగుబడి వున్నై. అవికూడ సత్పాత్రుని చూచి యివ్వాలనుకుంటున్నా. ప్రియము నాకు అఖర్లేదు. అసలుధర 3200- నాకు యివ్వండి.

తిన్:- యిక నే నమ్మనూ అమ్మను, కొననూ కొనను. మీరు నన్ను యిరికించాలని చూస్తున్నారు గాని.

శ్యామ:- శివ, శివ! నేను మేలుకోసమే చెప్పుతున్నాను. అంత యివ్వదల్చుకో పోతే2400/- రెండు వేలు- వేయి-.

తిన్:- ఒక్క దమ్మిడీ కూడలేదు.

శ్యామ:- బ్రాహ్మణుడు బ్రాహ్మడి దగ్గర దానం పట్టకూడదు. లేకపోతే మీవంటి మహాలుభావులకు

పూరకనే యివ్వవలసింది. మీరు కొద్దిగా వెలయిచ్చి తీసుకోండి. అయిదువందలు. Transfer form నా దగ్గర తయారుగా వుంది- విపిన్ కొంచెం యిట్లా యివ్వు.

తీన్:- నే- నేను ఎనభై రూపాయలు యిస్తా.

శ్యామ:- సరే అంతే యివ్వండి. చాల నష్టం వచ్చింది. జగన్మాత యిచ్ఛయింతే కాబోలు!

గండేరీ- భలేచాటు కొట్టారండీ- రావుసాహెబు గారూ!

తీన్‌కాడీబాబుగారు జేబులోంచి మనీపర్సు తీసి- యింతకుముందే పెన్షను తీసుకున్న డబ్బునుండి, ఎనిమిది పదులు జాగ్రతగా లెఖపెట్టి యిచ్చాడు. శ్యామ బాబు వాటిని జేబులో పెట్టుకొని అన్నాడు- ఆయితే నాకిక సెలవిప్పించండి. ఇంట్లో సత్యనారాయణవ్రతం వుంది. యిక మీమీదే కంపెనీ భారత మంతా పడింది, నాకు దిగులు తీరింది. శుభమస్తు. సిద్ధేశ్వరి మీకు మంగళంచేకూర్చుగాక!'

శ్యామ బాబు వెళ్లిన తర్వాత రావు సాహెబు నవ్వుతూ అన్నాడు- శ్యామ బాబు కొంచెం టక్కరిగా కనపడినా కల్లా కపటం లేనివాడు. అయిదారు మాసాలనుంచి నన్ని నొప్పులు మరీ మూలలను పడవేసినై. లేకపోతే కంపెనీ స్థితి యిట్లా వుండేదా! కానివ్వండి యిక నడుముకట్టుకు పనిచేస్తాను. నాకు ఖచ్చితమైన పని కావాలి- నన్నెవడూ టోపీ వేయలేడు.

గండేరీ:- యికమీరే మీ శ్రమపడ నక్కర్లా, కంపెనీ మునగనే మునిగింది, మీరిక తన్ని పెట్టుకొని పండుకోవచ్చు.

రావు:- అ-అయితే నాజీతం-.

గండే:- జీతంకూడా కావాలి! ఎవరి దగ్గరనుంచి తీసుకుంటా? రావు సాహెబుగారూ, శ్యామ బాబు చేసిన ట్రిక్ యింకా తెలియలేదు? తొంభై వేల రూపాయలు కంపెనీ బాకీపడి వుంది! రెండురోజులున్నాక కంపెనీ లిక్విడేషన్ అయిపోతుంది. లిక్విడేటర్ సెకండ్ కాల్ వసూలుచేస్తే అప్పు తీరుతుంది.

రావు:- ఏమిటీ? నేనిక దమ్మిడీకూడ యివ్వను.

గండేరీ:-మీరివ్వడ మేమిటి?గవర్మెంటు చెవులు మెలేసి వసూలు చేస్తుంది. లా అనుకున్నారా, ఏంటను కున్నారు?

అట:- మీరొక్కరే యిస్తారనుకున్నారేం? షేరుకు రెండుచొప్పున అందరూ యివ్వాల్సిందే. మీదగ్గర అదివరకు 200షేర్లు వున్నై. యివ్వాళ శ్యామ బాబు దగ్గర కొన్నవి 1600. మొత్తం 1800, కు 3 600- రూపాయలు యివ్వాలి. అప్పు తీరిన తర్వాత లిక్విడేషన్ ఖర్చులుపోను మిగతా వాపసు రావచ్చు.

రావు:- మీరు ఎంత యివ్వాలి?

గండేరీ రామ్ బొటనవ్రేళ్ళు ఆడిస్తూ అన్నాడు- హేమీలేదు! హేమీలేదు!! మాషేర్లన్నీ శ్యామ బాబు కొని యిందాక మీకు అమ్మేడు.

రావు- దొంగలు, అంతా దొంగలు! నేనివ్వాళే కోల్డుహామ్ దొరగారికి వుత్తరం వ్రాస్తాను.

అటల్:—అయితే మేం పోతున్నాం. మాదగ్గర షేర్లు కూడా లేవు! మేమిక డైరక్టర్లము కూడా కాము. మీరిక పనిసాగించండి. పదండి గండేరీరాంగారు!

రావు:—ఆ—

గండేరీ.—రామ్, రామ్!